చెత్తశుద్ధి ఏదీ?

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం గంపలగూడెం మండలంలో అమలుకు నోచుకోలేదు. ఈ పథకం కింద గ్రామాల్లో సేకరించిన చెత్తచెదారాన్ని రీ సైక్లింగ్ చేయడానికి నిర్మించిన సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. రోడ్డు మార్జిన్లు డంపింగ్ కేంద్రాలుగా మారుతున్నాయి. పథకం అమలులో చిత్తశుద్ధి లోపించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- అలంకారప్రాయంగా సంపద కేంద్రాలు
- శిథిలావస్థలో రీసైక్లింగ్ షెడ్లు
- రూ.లక్షల్లో ప్రజాధనం వృథా
- రోడ్డు మార్జిన్లే డంపింగ్ యార్డులు



పెదకొమెర శివారు తోటమూలలో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

గంపలగూడెం: మండలంలో 24 గ్రామ పంచాయతీలుండగా అన్ని గ్రామాల్లో సంపద కేంద్రాలను నిర్మించారు. సేకరించిన చెత్త రీసైక్లింగ్ చేసి ఇనుము, ప్లాస్టిక్ వేరు చేసి ఆర్థిక వనరులు పెంచుకోవడంతో పాటు తడి చెత్తతో వర్మికంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించి పంచాయతీ ఆదాయం పెంచుకోవచ్చు. ఇందుకు ప్రతి గ్రామంలో జనాభా సంఖ్యకనుగుణంగా ఇద్దరి నుంచి ఐదుగురు చొప్పున గ్రీన్ అంబాసిడర్లను నియమించి ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి వేతనాలు చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ పథకం అమలులో భాగంగా తడి, పొడి చెత్త సేకరణ నిమిత్తం గ్రామాల్లో ఇంటింటికీ రెండు చెత్త బుట్టలను ఉచితంగా పంపిణీ చేశారు. చెత్త సేకరించేందుకు ఎలక్ట్రిక్ రిక్షాలను కూడా ప్రభుత్వం పంచాయతీలకు అందజేసింది. మేజర్ పంచాయతీలలో ట్రాక్టర్లను, రిక్షాలను సైతం సరఫరా చేశారు. కాలువల్లో మురుగు తొలగింపు నిమిత్తం పంపిన యంత్రం కూడా వినియోగించకుండా మూలన పడేశారు.



గంపలగూడెం శివారులో రోడ్డు పక్కన చెత్తకుప్పలు

పిచ్చిమొక్కలతో నిండిన సంపద కేంద్రాలు

స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం కాగితాలకే పరిమితమై గ్రామాల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. షెడ్లు శిథిలావస్థకు చేరాయి. గ్రీన్ అంబాసిడర్లను నియమించడానికి ప్రభుత్వం ఇచ్చే వేతనాలు అరకొరగా ఉండటంతో ఎవరూ ముందుకు రావట్లేదని అధికారులు చెబుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డు మార్జిన్లలోనే గ్రామంలో సేకరించిన చెత్తను పారబోస్తుండటంతో డంపింగ్‌యార్డులుగా మారుతున్నాయి. గంపలగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో సేకరించిన చెత్తను తిరువూరు–గంపలగూడెం ఆర్ అండ్ బీ రహదారి పక్కన డంపింగ్ చేస్తుండటంతో కుళ్లి దుర్వాసన వస్తోంది. మిగిలిన గ్రామాల్లో సైతం ఇదే పరిస్థితి కనిపిస్తోంది. చెత్తకుప్పల్లో పందులు, కుక్కలు, కోతులు స్వైరవిహారం చేస్తూ చెత్తచెదారాన్ని రోడ్లపై పడేస్తున్నాయి.

ఊరికి దూరంగా సంపద కేంద్రాలు

గతంలో గ్రామ పంచాయతీ అధికారులు ప్రభుత్వ ఒత్తిడి మేరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు ఖర్చు చేసేందుకు సంపద తయారీ కేంద్రాలను హడావుడిగా నిర్మించారు. ఊరికి దూరంగా నిర్మించిన కేంద్రాలకు రిక్షాలలో చెత్తను తరలించడం సాధ్యపడట్లేదు. సక్రమంగా వినియోగించకపోవడంతో రిక్షాలు తుప్పు పట్టి మూలకు చేరాయి. సంపద తయారీ కేంద్రాలకు అనుబంధంగా ఖాళీ స్థలాలు లేకపోవడంతో చెత్త డంపింగ్ చేసేందుకు అవకాశం లేకుండా పోయిందని అధికారులు చెబుతున్నారు.

వినియోగంలోకి తేవాలి



ప్రభుత్వం ఉన్నతాశయంతో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు అధికారుల ఉదాసీన వైఖరి కారణంగా నిరుపయోగంగా మిగిలాయి. వీటిని వినియోగంలోకి తీసుకురావడానికి వెంటనే చర్యలు చేపట్టాలి.

– సువారపు చంద్రశేఖరరావు, గంపలగూడెం

నిర్లక్ష్యం శోచనీయం



గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం అధికారుల పర్యవేక్షణ లేక నిరుపయోగంగా మారింది. మేజరు పంచాయతీల్లో సైతం ఇటువంటి నిర్లక్ష్యం కనిపించడం శోచనీయం. వెంటనే స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం చిత్తశుద్ధితో చేపట్టాలి.

– గౌర్రాజు నాగరాజు, గంపలగూడెం

క్షేత్రస్థాయి సమస్యలు పరిష్కరిస్తాం

చెత్త నుంచి సంపద తయారీ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడానికి పలు సమస్యలు నెలకొన్నాయి. క్షేత్రస్థాయిలో సిబ్బంది లేకపోవడం, డంపింగ్ యార్డుల కొరత, సంపద తయారీ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు, ఖాళీ స్థలాల సేకరణకు ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– దాకరపు బాబూరావు, ఈఓపీఆర్‌డీ, గంపలగూడెం

క్లుప్తంగా

నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు ప్రారంభం



మైలవరం: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ (అప్సా డెమోక్రటిక్) ఆధ్వర్యంలో మైలవరం నియోజకవర్గ స్థాయి ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఆటల పోటీలు స్థానిక ఎస్ఎస్‌కే పాఠశాలలో శనివారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలలో మొత్తం 15 పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో బాలురు, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, షటిల్, టెన్నికాయిట్, లాంగ్ జంప్, రన్నింగ్, షార్ట్‌పుట్ తదితర పోటీలు నిర్వహించారు. అప్సా డెమోక్రటిక్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి మోహనరావు, జిల్లా అధ్యక్షుడు టి.మల్లికార్జునరెడ్డి, ఎం. శ్రీనివాసరావు, వివిధ పాఠశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత



మైలవరం: మైలవరంలో ఆర్య వైశ్య మండల కమిటీ ఆధ్వర్యంలో పేదవారైన ఆర్య వైశ్య కుటుంబ సభ్యులకు పెద్దలు సహకారంతో శనివారం నిత్యావసర సరకులు అందజేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బయ్యన శ్రీనివాసరావు, కార్యదర్శి కాజా మహేష్, స్థానిక ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు చారుగుళ్ల ప్రసాద్, కల్లూరి కన్నయ్య, అనుమోలు గాంధీ, జూలకంటి ప్రసాద్, జూలూరు ఉమామహేశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

18న భవానీ పేరంటాళ్లమ్మ తిరునాళ్లు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని శ్రీచంద్రశేఖర సమేత భవానీ పేరంటాలు అమ్మవారి ఉత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయని గ్రామపెద్ద రామిశెట్టి చంటి శనివారం తెలిపారు. ఈనెల 18న భవానమ్మ, అంకమ్మ అమ్మవార్ల తిరునాళ్ల వైభవంగా ప్రారంభమవుతుందన్నారు. 16న దామెర్ల వీధి నందు అమ్మవారి పుట్టినింటిలో కుమ్మరి గరిటి వద్ద బలి, అంకురార్పణ జరుగుతుందని చెప్పారు. 17న ఉదయం అమ్మవారికి బోనాలు, సారె సమర్పిస్తారన్నారు. సాయంత్రం అంకమ్మ వారికి పంబల వారిచే పట్నపు సేవ ఉంటుందని చెప్పారు. 18న సాయంత్రం అమ్మవారికి సిరిమానోత్సవం నిర్వహిస్తారన్నారు. అనంతరం పవళింపు సేవలు జరుగుతాయని వివరించారు. తిరునాళ్లలో వేలాదిగా భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

అగ్ని బాధిత కుటుంబానికి సాయం

ఆగిరిపల్లి: స్థానిక దళితవాడలో ఈ నెల 6న విద్యుదాఘాతంతో గొల్లపల్లి విజయ్ కుమార్ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. నిరాశ్రయులైన బాధిత కుటుంబాన్ని స్థానిక భాగ్యలక్ష్మి ఇండేన్ గ్యాస్ నిర్వాహకులు పాలడుగు శ్రీనివాసరావు పరామర్శించి నిత్యావసర వస్తువులు, వంట సామాగ్రి, దుప్పట్లను శనివారం అందజేశారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ముసునూరు: కలిసి మెలసి చదువుకుని, నేడు వివిధ హోదాల్లో స్థిరపడిన మిత్రులంతా ఆనాటి స్నేహ బంధాన్ని గుర్తు చేసుకుని మైమరచిపోయారు. రమణక్కపేట జెడ్పీ హైస్కూల్లో ప్రస్తుత హెచ్ఎం రామకృష్ణారావు అధ్యక్షతన 1988–1989 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి హెచ్ఎం కేవీఎస్ఆర్ ప్రసాదరావు, ఉపాధ్యాయురాలు కృపావరం మాట్లాడుతూ అలనాడు విద్య నేర్పిన గురువులు, సహచర విద్యార్థులతో కలిసి జ్ఞాపకాలు నెమరు వేసుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నంబూరి ఎలీషా, గుప్తా రమేష్ ఆధ్వర్యంలో తమ గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు పల్లె రవీంద్రారెడ్డి, చల్లగుళ్ల నాగమల్లేశ్వరరావు, మామూరి దేవేంద్ర రెడ్డి, మంగళాద్రి, ఎర్రసూరి ప్రసాద్, ఆకుల ప్రసాద్, అశోక్, రాజశేఖర్, ఆంథోని పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుకు సమాయత్తం

చాట్రాయి: తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయాన్నిచ్చే రబీ మొక్కజొన్న సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ఖరీఫ్ వరి తర్వాత రబీ మొక్కజొన్న సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. సుమారు 10 వేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. బోరు సదుపాయం ఉన్న రైతులు రబీ మొక్కజొన్న సాగు చేస్తున్నారు. మొక్క జొన్న పంటకు ఇటీవల విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో ఆశించిన ధర పలుకుతుండడంతో రైతులు రబీ మొక్కజొన్న సాగుకు ఆసక్తి చూపుతున్నారు.



చాట్రాయిలో మొక్కజొన్న విత్తుతున్న కూలీలు

సైబర్ నేరాలపై మహిళలకు అవగాహన

కాకర్ల(తిరువూరురూరల్): గ్రామీణ ప్రాంతాల్లో సైతం వైట్ కాలర్ నేరాలు జరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిరువూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ గిరిబాబు అన్నారు. మండలంలోని కాకర్లలో శనివారం సైబర్ నేరాలపై మహిళలకు అవగాహన కల్పించారు. బ్యాంకుల్లో నగదు వేయడానికి, ఉపసంహరించడానికి వెళ్లినపుడు ఎవరికీ లావాదేవీల వ్యవహారం చెప్పవద్దని, ఏటీఎం కార్డులు, నెట్ బ్యాంకింగ్, డిజిటల్ లావాదేవీలకు సంబంధించిన పాస్‌వర్డు బహిర్గతం చేయరాదని సూచించారు. ఏటీఎం కార్డు కొత్తవి ఇస్తామని, డిజిటల్ యాప్‌లు ఇన్‌స్టాల్ చేస్తామని మోసపూరిత మాటలు చెప్పి పాస్‌వర్డు లేదా ఓటీపీ అడిగితే చెప్పవద్దని సీఐ సూచించారు.

సీసీ రహదారుల నిర్మాణం ప్రారంభం

ఆంజనేయపురం(తిరువూరురూరల్): మండలంలోని ఆంజనేయపురంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మించనున్న సీసీ రహదారుల పనులను సర్పంచి మామిడి కుటుంబరావు శనివారం ప్రారంభించారు. రూ.12 లక్షలతో గ్రామంలోని రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు సర్పంచి తెలిపారు. పంచాయతీ కార్యదర్శి నరేంద్ర పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

ఆగిరిపల్లి: మండలంలోని రాజవరానికి చెందిన కొవ్వలి నిర్మల మృతిచెందడంతో శనివారం సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ దుర్గారావు ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన పథకంలో రూ. 2 లక్షల బీమా చెక్కును ఆమె భర్త అశోక్ కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ తిరుపతమ్మ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ముసునూరు: బాల్య వివాహాలు చేసుకోవడం, చేయడం కూడా చట్టరీత్యా నేరమని అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించారు. మండలంలోని చింతలవల్లిలో ఐసీడీఎస్ కార్యకర్తల ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. 18 ఏళ్ల నిండి మేజర్లయ్యేంత వరకూ ఆడపిల్లల వివాహం చేసుకోకూడదని, వారు చదువుకునేలా చూడాలని సూచించారు. బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత నివారణ విషయంలో జాగ్రత్త వహించాలన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

నూజివీడు: పట్టణంలోని పలు ప్రాంతాల్లో దోమల నివారణకు మున్సిపల్ పాలకవర్గం పలు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా మురుగునీటి గుంతల్లో, డ్రెయినేజీల్లో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నారు. స్థానిక ఎంప్లాయీస్ కాలనీలోని డ్రెయినేజీల్లో, మురుగునీటి తటాకాల్లో దోమల నివారణ మందును శనివారం పిచికారీ చేశారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

గంపలగూడెం: మండలంలోని రెండు గ్రామాల్లో తెలంగాణ నుంచి తెచ్చి విక్రయిస్తున్న మద్యం సీసాలను ఎక్సైజ్ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వర్మ తెలిపిన కథనం ప్రకారం.. గుళ్లపూడిలో బుచ్చాల అంజయ్య వద్ద ఆరు తెలంగాణ మద్యం సీసాలు లభ్యమయ్యాయి. చింతలనర్వలో రాయవరపు జయకర్ తరలిస్తున్న 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

బాధితులకు సత్వర న్యాయమే ధ్యేయం

రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి



మాట్లాడుతున్న రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివపార్వతి

నూజివీడు: ప్రజలకు సత్వర న్యాయం చేకూర్చేందుకు లోక్ అదాలత్‌లను, ప్రజలను చైతన్య పర్చేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహిస్తున్నామని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివపార్వతి అన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లు నిర్వహించి కక్షిదారుల కేసులను రాజీ మార్గంలో పరిష్కరిస్తున్నామన్నారు. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు, ఎస్సీలు, ఎస్టీలు, కార్మికులు, నిర్బంధంలో ఉన్న వ్యక్తులు, ప్రకృతి విపత్తులకు సంబంధించిన బాధితులు, అక్రమ రవాణా బాధితులు, యాచకులు తదితరులు ఉచిత న్యాయ సాయం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఇందుపల్లి సత్యప్రకాష్, కార్యదర్శి మడుపల్లి మధు రవిశంకర్, సీనియర్ న్యాయవాదులు బసవరాజు రామకృష్ణ, నందూరి పద్మాంజలి, కళాశాల డైరెక్టర్ గొల్లపూడి రవిబాబు, ప్రిన్సిపాల్ శ్రీమన్నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై పునఃసమీక్షించాలి

మాల యోధుల సంక్షేమ సంఘం డిమాండ్



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న మాల యోధుల సంక్షేమ సంఘం నాయకులు

నూజివీడు: ఎస్సీ వర్గీకరణ తీర్పును పునఃసమీక్షించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని మాల యోధుల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని స్త్రీశక్తి భవన్‌లో శనివారం నూజివీడులో ఈనెల 24న నిర్వహించనున్న మాలల ఆత్మ గౌరవ సభ నిర్వహణకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దళితులందరూ ఒకే తాటిపై ఉండాలని బీఆర్ అంబేడ్కర్ ఆకాంక్షిస్తే కొందరు స్వార్థపరులు దళితులను విడదీయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. మాలలందరూ పార్టీలకతీతంగా ఒకే తాటిపైకి వచ్చి ఏర్పాటు చేసుకున్నదే మాల యోధుల సంక్షేమ సంఘమని అన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌ను ఇప్పుడున్న 15 శాతం నుంచి 25 శాతానికి పెంచాలని, ప్రైవేటు రంగంలో ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, మాల యోధుల సంక్షేమ సంఘం కోర్ కమిటీ సభ్యులు చేబత్తిన మున్నా, నత్తా నాగేశ్వరరావు, పిల్లా చరణ్, కాలి సుగుణరావు, బుర్రి సుధాకర్, పిల్లెం రామారావు, మోచర్ల కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

14న ధరల భారాలకు వ్యతిరేకంగా ధర్నా



చీమలపాడులో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వరరావు తదితరులు

ఎ.కొండూరు: ప్రజా సమస్యలపై పోరుయాత్రను జయప్రదం చేయాలని కోరుతూ చీమలపాడు గ్రామంలో వాల్‌పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. సీపీఎం మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు అదుపు చేయడంలో విఫలమయ్యాయని చెప్పారు. ప్రజలపై అనేక విధాలుగా భారాలు వేస్తూ దేశ సంపదను అంబానీ, అదానీలకు కేంద్ర ప్రభుత్వం దోచిపెడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై రూ. 18 వేల కోట్ల భారం మోపనుందని చెప్పారు. ధరల భారాలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన ఎ.కొండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నామని, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు పి. ఆనందరావు, ఆళ్ల అమ్మిరెడ్డి, యోహాన్, సోములు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న శేఖర్ వర్మ



తిరువూరు దాసాంజనేయ స్వామి ఆలయానికి విరాళం అందజేస్తున్న చలపతిరావు

నెమలి(గంపలగూడెం): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నెమలి వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి ఒక భక్తుడు రూ.50 వేల విరాళాన్ని శనివారం అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామానికి చెందిన పెనుపోతు శేఖర్ వర్మ, విజయదుర్గలు ఈ విరాళాన్ని ఆలయ సిబ్బందికి అందజేశారు. దాతను ఆలయ అర్చకుడు తిరునగరి గోపాలాచార్యులు ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు.

ఆలయానికి భక్తుల విరాళం..

తిరువూరు: స్థానిక జగన్నాథపురం కాలనీలో పునర్నిర్మిస్తున్న దాసాంజనేయ స్వామి ఆలయానికి దాతలు విరాళాలు అందజేశారు. విజయవాడ వేగా జ్యూయలర్స్ అధినేతలు నవీన్, సుధాకర్ రూ.లక్షా 116, తిరువూరుకు చెందిన తుమ్మల చలపతిరావు రూ.11,111 విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీకి అందజేశారు. 2025 ఫిబ్రవరిలో ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయని, నిర్మాణ పనులకు దాతలు తమవంతు సహకారం అందజేయాలని ఆలయ ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబు కోరారు.

వేంకటాచలస్వామికి ప్రత్యేక పూజలు

తిరువూరు: స్థానిక వేంకటాచలస్వామి దేవస్థానంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా శనివారం పుష్పయాగం, సహస్ర దీపాలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో మహిళలు పలు రకాల పుష్పాలతో ఆలయాన్ని, స్వామివారి మూల విరాట్‌ను అలంకరించారు. వేంకటాచలస్వామికి సహస్ర నామార్చన, కుంకుమార్చన జరిపారు. పట్టణ ప్రముఖులు సంకా రాంబాబు సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు.



పుష్పయాగం సందర్భంగా స్వామివారి అలంకరణ

కరపత్రాల ఆవిష్కరణ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సీపీఎం పట్టణ 8వ మహాసభ ఆదివారం కొండపల్లిలో జరుగుతుందని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ తెలిపారు. ఈ మేరకు శనివారం మహాసభ కరపత్రాలను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. మహాసభలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు, జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్, సీఐటీయూ, సీపీఎం నాయకులు, వివిధ ప్రజాసంఘాల నేతలు పాల్గొంటారన్నారు. స్థానిక నాయకులు, ఐద్వా సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని దంపతులకు గాయాలు

జూపూడి(ఇబ్రహీంపట్నం): జూపూడి సమీపంలో పెదలంక గ్రామం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ఢీకొన్ని భార్యాభర్తలకు గాయాలైన ఘటన శనివారం జరిగింది. ఇరుకుగా ఉన్న రోడ్డులో రెండు ట్రాక్టర్లు ఎదురైన క్రమంలో బైకుపై వెళుతున్న భార్యాభర్తలు దాసరి శివశంకర్, నాగలక్ష్మిలను ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్య కాళ్లకు గాయాలు కాగా, భర్తకు కూడా స్వల్ప గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పెదలంక గ్రామస్తులు ఘటనా స్థలానికి వచ్చి ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఇసుక రవాణాతో మా ప్రాణాలు పోయేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం పోలీస్ స్టేషన్‌కు చేరడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రస్తుతం ట్రాక్టర్లను నిలుదల చేశారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

నూజివీడు: నూజివీడు మండలం ఓగిరాల తండా సమీపంలోని అటవీ ప్రాంతంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను శనివారం ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ అప్పంగారి మస్తానయ్య తెలిపారు. ఎక్సైజ్ సిబ్బంది నిర్వహించిన దాడుల్లో బెల్లపు ఊట నిల్వలను కనుగొని వాటిని ధ్వంసం చేశారన్నారు.

పార్టీలకతీతంగా సమైక్యంగా ఉండాలి

నూజివీడు: మాదిగలంతా పార్టీలకతీతంగా ఐక్యంగా ఉండి జాతి అభివృద్ధికి కృషి చేయాలని నియోజకవర్గ మాదిగ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో శనివారం మాదిగ నేతల నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ మాదిగ బిడ్డలంతా చదువుకునేలా చూడాలన్నారు. చదువు ద్వారానే జీవితాల్లో మార్పు వస్తుందని చెప్పారు. ఈ నెలలో వనసమారాధన నిర్వహించి మాదిగలందరినీ ఒకే తాటిమీదకు తీసుకురావాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముసునూరు: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో రమణక్కపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జేఈ కేవీ సుబ్బారావు తెలిపారు. అక్కిరెడ్డిగూడెం, రమణక్కపేట, సూరేపల్లి, గొల్లగూడెం గ్రామాల్లో మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.